సాక్షి
బాపట్ల
గురువారం । 3 । అక్టోబర్ । 2024



ఆలయ అభివృద్ధికి విరాళం

తాడేపల్లిరూరల్: కంఠంరాజు కొండూరులో వేంచేసి ఉన్న మహంకాళీ అమ్మవారి ఆలయ అభివృద్ధికి కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన కొమ్మినేని నిష్‌నాథ్ రూ.లక్ష అందజేశారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 32,600 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 16,000 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 588.70 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 9,900 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

న్యూస్‌రీల్

భక్తిశ్రద్ధలతో పితృకార్యాలు



అమరావతి: అమరా రామక్షేత్రంలో బుధవారం మహాలయ అమావాస్యను పురస్కరించుకుని పలువురు తమ తమ పితృదేవతలకు భక్తి శ్రద్ధలతో పితృకార్యాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు కాలం చేసిన తమ తల్లిదండ్రులు, బంధువులకు పిండ ప్రదానం చేసి ఆ పిండాలను కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. అనంతరం భక్తులు పవిత్ర కృష్ణానదిలో స్నానమాచరించి బాల చాముండికా సమేత అమరేశ్వరుడిని దర్శించుకున్నారు.

పులిచింతల వద్ద మొసలి



అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు పై బుధవారం ఉదయం మొసలి సంచరించడాన్ని స్థానికులు గమనించారు. ఈ విషయాన్ని కొందరు ప్రాజెక్టు నిర్వాహకులకు తెలియచేయడంతో వారు వచ్చి మొసలిని ప్రాజెక్టు స్టాక్ పాయింట్‌లోకి పంపించారు. ప్రాజెక్టు మీదుగా వెళ్లే పాదచారులు, నదిలో స్నానాలకు వెళ్లేవారు జాగ్రత్త వహించాలని తహసీల్దారు జి.శ్రీనివాస యాదవ్ సూచించారు.

నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



పెదకాకాని: ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో అక్టోబరు 3 నుంచి 12వ తేదీ వరకు శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. వేడుకలను పురస్కరించుకుని భ్రమరాంబ అమ్మవారు బాలా త్రిపుర సుందరి, గాయత్రి, అన్నపూర్ణ, లలితా త్రిపురసుందరి, కదంబ వనవాసిని, మహాలక్ష్మి, సరస్వతి, దుర్గ, మహిషాసురమర్దిని, రాజరాజేశ్వరి అలంకరణల్లో భక్తులను దర్శనం ఇవ్వనున్నారు. విజయ దశమి రోజున ఉదయం మహా పూర్ణాహుతి, సాయంకాలం శమీపూజ నిర్వహించనున్నారు. గురువారం అమ్మవారు బాలా త్రిపుర సుందరి దేవిగా భక్తులను అనుగ్రహించనున్నారు.

విజయకీలాద్రిపై ప్రత్యేక పూజలు



తాడేపల్లిరూరల్ : సీతానగరం విజయకీలాద్రి దివ్య క్షేత్రంపై బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ భాద్రపద అమావాస్యను పురస్కరించుకుని శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి మంగళ శాసనాలతో కార్యక్రమాలు నిర్వహించామన్నారు.

అమ్మవారికి రూ.2 లక్షల పట్టుచీరలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై నిర్వహిస్తున్న దసరా ఉత్సవాలలో అమ్మవారి అలంకరణకు అవసరమైన పట్టుచీరలను భక్తులు దేవస్థానానికి అందజేస్తున్నారు. విజయవాడకు చెందిన సినీ దర్శకుడు పి.కాశీ పరశురామ్ తల్లిదండ్రులైన శ్రీనివాసరావు, నాగజ్యోతి, మరో భక్తుడు రావాడ చిరంజీవిరావు బుధవారం రూ.2 లక్షల విలువైన పట్టుచీరలను దేవస్థానానికి అందజేశారు. దసరా ఉత్సవాలలో అమ్మవారికి జరిగే విశేష అలంకరణను పురస్కరించుకుని ఆయా రంగుల చీరలను అందజేసినట్లు ఆలయ అర్చకులు పేర్కొన్నారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించగా, వేద పండితులు ఆశీర్వచనం అందించారు.

ఇంద్రకీలాద్రిపై నెలకొన్న శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం దసరా మహోత్సవాలకు ముస్తాబైంది. గురువారం నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాలు 12వ తేదీ శనివారంతో ముగుస్తాయి. ఈ పది రోజుల్లో 15 లక్షల మంది భక్తులు విచ్చేస్తారని అంచనా. ఉత్సవాలు ముగిసిన రెండు, మూడు రోజుల వరకు కూడా భవానీల రద్దీ కొనసాగుతుంది.


ఇంద్రకీలాద్రికి ఉత్సవ శోభ



విద్యుద్దీపకాంతులతో శోభాయమానంగా వెలుగొందుతున్న శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం

- నేటి నుంచి శ్రీదేవీ శరన్నవరాత్రులు ప్రారంభం
- అమ్మవారి దర్శనానికి 15 లక్షల మంది వస్తారని అంచనా
- భక్తులకు సౌకర్యవంతంగా సకల ఏర్పాట్లు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటకల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి దుర్గమ్మను విశేష అలంకారాలలో దర్శించుకోనున్నారు. ప్రధాన ఆలయంలో మూలవిరాట్‌కు విశేష అలంకరణ జరుగుతుండటంతో పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి విచ్చేస్తుంటారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తుల కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని దేవదాయ, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు చెబుతున్నారు. భవానీల రద్దీ తగ్గేవరకు ఆలయ ప్రాంగణంలో ఉత్సవ ఏర్పాట్లు యథావిధిగా కొనసాగుతాయన్నారు.



సులభంగా... సౌకర్యవంతంగా!

అమ్మవారి దర్శనానికి ఇతర ప్రాంతాల నుంచి విచ్చేసే భక్తులు చిన్నపాటి జాగ్రత్తలు పాటించడం ద్వారా దర్శనం చాలా సులభంగా, సౌకర్యవంతంగా చేసుకోవచ్చు. రైలు, బస్సుల్లో నగరానికి చేరుకునే భక్తులు దేవస్థానం బస్సులతో పాటు ప్రయివేటు వాహనాలలో వీఎంసీ కార్యాలయం వరకు చేరుకుంటారు. అక్కడే దేవస్థానం ఏర్పాటు చేసిన క్లోక్‌రూమ్‌లలో లగేజీ భద్రపరుచుకుని కెనాల్ రోడ్డులోని వినాయకుడి గుడి నుంచి క్యూలైన్‌లోకి చేరుకోవచ్చు. ఒక వేళ భక్తులు అధిక సంఖ్యలో ప్రయివేటు వాహనాలలో నగరానికి చేరుకున్నట్లయితే వారి వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక పాయింట్లు ఏర్పాటు చేశారు. వాహనాలను పార్కింగ్ చేసుకున్న అనంతరం కెనాల్ రోడ్డుకు చేరుకుని క్యూలైన్‌లోకి ప్రవేశించవచ్చు. హైదరాబాద్ వైపు నుంచి వచ్చే వారి కోసం భవానీపురం పరిసరాలలో వాహనాలను నిలుపుకొని హెడ్‌వాటర్ వర్కు నుంచి ప్రారంభమయ్యే క్యూలైన్ల ద్వారా ఆలయానికి చేరుకోవచ్చు. స్నానఘాట్లకు సమీపంలోనే పార్కింగ్ ప్రదేశాలు ఉండేలా పోలీసు శాఖ చర్యలు తీసుకుంది.

టికెట్ల విక్రయాలకు ప్రత్యేక కౌంటర్లు

రూ.500 టికెట్‌పై అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తుల కోసం దేవస్థానం అదనపు టికెట్ కౌంటర్లు ఏర్పాటు చేసింది. వినాయకుడి గుడి నుంచి ప్రారంభమయ్యే క్యూలైన్లలో టోల్‌గేట్, ఓం టర్నింగ్, ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీ గణపతి ప్రాంగణం వద్ద టికెట్ కౌంటర్లు అందుబాటులో ఉన్నాయి. ఇవే కాకుండా సీతమ్మ వారి పాదాలు, పున్నమి ఘాట్, స్టేట్ గెస్ట్ హౌస్‌లలో వీఐపీ టికెట్ల కౌంటర్లు ఏర్పాటు చేశారు.ఆయా ప్రాంతాలలో టికెట్లు కొనుగోలు చేసిన భక్తులను దేవస్థానం తమ వాహనాలపై ఘాట్‌రోడ్డులోని ఓం టర్నింగ్ వరకు చేరుస్తుంది. అక్కడి నుంచి క్యూలైన్ ద్వారా అమ్మవారిని దర్శించుకోవచ్చు.

ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి : ఈవో

దసరా ఉత్సవాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని దుర్గగుడి ఈవో కె.ఎస్.రామరావు తెలిపారు. దసరా ఉత్సవాల ఏర్పాట్లపై బుధవారం మహామండపం ఆరో అంతస్తులో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 5 క్యూలైన్ల ద్వారా భక్తులు నిరంతరం అమ్మవారిని దర్శించుకుంటారన్నారు. సాయంత్రం అమ్మవారికి మహా నివేదన, పంచహారతుల సమయంలో అంతరాలయంలో హారతులు జరుగుతుంటాయని, ఆ సమయంలోనూ దర్శనాలు కొనసాగుతాయన్నారు. రూ.500 టికెట్ కొనుగోలు చేసిన భక్తులకు బంగారు వాకిలి దర్శనం మాత్రమే ఉంటుందన్నారు. దర్శనం అనంతరం మహా మండపం దిగువకు చేరుకునే భక్తులకు అన్న ప్రసాదంతో పాటు లడ్డూ ప్రసాదాలకు కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు.

దుర్గగుడిపై నేడు

- తెల్లవారుజామున అమ్మవారికి స్నపనాభిషేకం
- శ్రీబాల త్రిపుర సుందరీదేవిగా అలంకరణ, నిత్య పూజలు
- ఉదయం 9 గంటలకు అమ్మవారి దర్శనం
- ఉదయం 10 గంటలకు ప్రత్యేక కుంకుమార్చన, ప్రత్యేక శ్రీచక్రనవార్చన, ప్రత్యేక చండీహోమం
- సాయంత్రం 6 గంటలకు శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల నగరోత్సవ సేవ
- సాయంత్రం 6–30 గంటలకు అమ్మవారికి మహానివేదన, పంచహారతులు
- రాత్రి 11 గంటల వరకు అమ్మవారి దర్శనం

దుర్గమ్మకు పట్టుచీర సమర్పించిన సీపీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాలను పురస్కరించుకుని నగర పోలీస్ శాఖ తరపున సీపీ ఎస్వీ రాజశేఖరబాబు బుధవారం దుర్గమ్మకు పట్టువస్త్రాలను సమర్పించారు. అమ్మవారికి పట్టువస్త్రాలు, పూజా సామగ్రిని సమర్పించేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసిన సీపీ రాజశేఖర్‌బాబు దంపతులను ఆలయ ఈవో కె.ఎస్.రామరావు, ఆలయ అర్చకులు, వేద పండితులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, అర్చకులు, ఈవోకు సీపీ రాజశేఖరబాబు పట్టుచీర, పూజా సామగ్రిని అందజేశారు. అనంతరం ఆలయ ఈవో రామరావు సీపీతో పాటు ఇతర పోలీసు అధికారులకు అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.



అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించేందుకు ఆలయానికి విచ్చేస్తున్న సీపీ దంపతులు



అమ్మవారి దర్శనానికి ఏర్పాటుచేసిన క్యూలైన్లు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఈవో రామరావు



ఉత్సవాలకు పూర్తయిన అలంకరణ ఏర్పాట్లు

గ్రామాల్లో బెల్టు తెరుద్దాం

ప్రభుత్వ మద్యం దుకాణాలకు మంగళం పాడిన కూటమి ప్రభుత్వం ప్రజలకు కిక్కు ఎక్కించేందుకు సిద్ధమైంది. మద్యం దుకాణాలు తెరిచేందుకు దరఖాస్తులు ఆహ్వానించింది. నిబంధనలు పాటిస్తే కష్టమని భావించిన కొంతమంది మద్యం దుకాణం మాకే వస్తుందని, రాగానే బెల్టు షాపు మీకే ఇస్తామంటూ ముందస్తుగా డిపాజిట్లు సేకరిస్తున్నారు. గ్రామ గ్రామానికి ధర నిర్ణయించి వసూళ్లు చేస్తున్నారు. పచ్చ పార్టీ నేతలకు వాటాలు అందుతున్నట్లు సమాచారం.

- వాడవాడలా షాపులు తెరిచేందుకు సన్నాహాలు
- మద్యం సిండికేట్ల ముందస్తు వ్యూహం
- డిపాజిట్లు వసూళ్లు
- పచ్చనేతలకు, సిండికేట్లకు వాటాలు



సాక్షి ప్రతినిధి, బాపట్ల: మద్యం దుకాణాల మాటున అక్రమార్జనే ధ్యేయంగా పచ్చనేతలు పావులు కదుపుతున్నారు. ఇందుకోసం బెల్ట్‌షాపుల రూపంలో అనధికారికంగా మద్యం దుకాణాలను ఇబ్బడిముబ్బడిగా పెంచబోతున్నారు. ఊరూరా, అవసరమనుకుంటే ఒకే గ్రామంలో రెండు మూడు బెల్ట్‌షాపులు ఏర్పాటు చేసేందుకు సన్నద్ధమయ్యారు. ప్రభుత్వం సేకరిస్తున్న నాన్ రిఫండబుల్ రుసుం తరహాలో మద్యం దుకాణాల కోసం పోటీపడుతున్న వారు బెల్ట్‌షాపులకు అనుమతి పేరుతో ముందస్తు డిపాజిట్లు సేకరిస్తున్నారు. మద్యం షాపు రాగానే మీకే బెల్ట్ దుకాణం ఇస్తామని ఒప్పందం చేసుకుంటున్నారు. ఒక గ్రామంలో బెల్ట్ దుకాణమైతే ఒక ధర, చాలా గ్రామాలు కావాలంటే పెద్ద మొత్తంలో డిపాజిట్లు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. డిపాజిట్‌ను బట్టి బెల్ట్ షాపులను కేటాయిస్తామని ఆఫర్లు పెడుతున్నారు. దీంతో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో గ్రామస్థాయి నేతలు ప్రభుత్వం కేటాయించే మద్యం దుకాణం కంటే బెల్ట్ షాపుల కాంట్రాక్ట్ కోసం ఎగబడుతున్నారు. పచ్చనేతలకు అడిగిన కాడికి ముట్టజెపుతున్నారు. ప్రభుత్వం జిల్లాలో 117 సాధారణ మద్యం దుకాణాల ఏర్పాటుకు ఇప్పటికే గెజిట్ నోటిఫికేషన్ జారీచేయగా గీత కార్మికులకు సంబధించి మరో పది మద్యం దుకాణాలను ఏర్పాటు చేయబోతోంది.

నిబంధనలకు పాతర

ప్రభుత్వ నిబంధనల ప్రకారం మద్యం షాపుల్లో మద్యం అమ్మకాలు సాగిస్తే వ్యాపారులకు మిగిలేది అంతంత మాత్రమే. ఒక్కో దుకాణానికి నాన్ రిఫండబుల్ రుసుం రూ.2 లక్షలతోపాటు దుకాణానికి లైసెన్స్‌ఫీజు మొదటి ఏడాది రూ.55 లక్షలు, రెండో ఏడాది పదిశాతం పెంపుతో రూ.60.50 లక్షల చొప్పున చెల్లించాల్సి ఉంది. ఇవి కాకుండా మద్యం దుకాణాలను నడిపే సిండికేట్‌కు, పచ్చనేతలకు ఇచ్చే 20 శాతం వాటాలు లెక్కిస్తే పెట్టుబడి భారంగా మారుతుంది. ఈ పరిస్థితిలో నిబంధనల ప్రకారం మద్యం అమ్మకాలు సాగిస్తే మిగిలేది అంతంతమాత్రమే. దీంతో ఊరూరా బెల్ట్ షాపులు పెట్టి మద్యం అమ్మకాలు పెంచేందుకు పచ్చనేతలు సిద్ధమయ్యారు. దీంతో జిల్లాలో అనధికారికంగా వేలాది మద్యం దుకాణాలు ఏర్పాటు కానున్నాయి. గ్రామాల వారీ మద్యం డోర్ డెలివరీ రూపంలో అందుబాటులోకి రానుంది. దీంతో పేద, మధ్య తరగతి వర్గాలకు మద్యం మరింత అందుబాటులోకి వచ్చి ఆరోగ్య సమస్యలు తలెత్తడమే కాకుండా ఆర్థికంగా చితికి పోయే ప్రమాదం పొంచివుంది.

రెండేళ్లలో రూ.152.14 కోట్ల రాబడి

జిల్లాలో ఇప్పటివరకు 117 మద్యం దుకాణాలకు ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయగా ఇందులో వార్షిక ఏడాదికి రూ.55 లక్షలు చెల్లించే దుకాణాలు 36, రూ.65 లక్షలు చెల్లించే దుకాణాలు 81 ఉన్నాయి. రెండవ ఏడాదికి ఒక్కో దుకాణంపై 10 శాతం లైసెన్సు రుసుం అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. దీంతో మొదటి ఏడాది రూ.55 లక్షలు చెల్లించే దుకాణం రూ.60.50 లక్షలు, మొదటి ఏడాది రూ.65 లక్షలు చెల్లించే దుకాణం రూ.71.50 లక్షల చొప్పున చెల్లించాల్సి ఉంది. ఈ లెక్కన ప్రభుత్వానికి తొలి ఏడాది 117 దుకాణాలపై లైసెన్సు రుసుం రూపంలో రూ.72.45 కోట్లు, రెండవ ఏడాది రూ.79.69 కోట్లు చొప్పున రెండేళ్లకు రూ.152.14 కోట్లు రాబడి రానుంది. ఇది కాకుండా మద్యం దుకాణాల కోసం వేసే ప్రతి దరఖాస్తుకు రూ.2లక్షలు చెల్లించాల్సి వుండడంతో ఈ మొత్తం కోట్లలో ఉండే అవకాశముంది. గీత కార్మికుల దుకాణాల ఏర్పాటుకు సంబంధించి కొంత మొత్తంలో ప్రభుత్వానికి రాబడి రానుంది.

గాంధీజీ అహింసావాదంతోనే స్వాతంత్య్రం

- జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి
- జాతిపితకు ఘన నివాళులు

బాపట్ల: అహింసావాదంతో భారతజాతికి స్వాతంత్య్రం తెచ్చి పెట్టిన యుగపురుషుడిగా మహాత్మాగాంధీ చరిత్రలో నిలిచారని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో గాంధీ జయంతి కార్యక్రమం నిర్వహించారు. గాంధీజీ చిత్రపటానికి జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి పూలమాల వేసి నివాళులర్పించారు. జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు గాంధీజీ అన్నారు. కుల, వర్ణ బేధాలు లేని గొప్ప వ్యక్తిగా ఎదుగుతూనే, స్వాతంత్య్ర ఉద్యమానికి కోట్లాది మందిని కదిలించే శక్తిగా మారారని వర్ణించారు. ప్రజలను చైతన్యవంతులను చేసి స్వాతంత్య్ర ఉద్యమానికి నడుం బిగించారన్నారు. రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని అహింసావాదంతోనే గడగడలాడించారని ప్రశంసించారు. గాంధీజీ చేసిన కృషిని భావితరాల ప్రజలకు వివరించాలన్నారు. ప్రజలలో జాతీయభావాన్ని నింపి, భారతజాతి గౌరవాన్ని మరింత ఇనుమడింపచేశారన్నారు. జాతిపితగా చరిత్రకెక్కారన్నారని అన్నారు. గాంధీజీ కన్న కలలు, చేసిన కృషిని భావితరాలకు అర్థమయ్యేలా వివరించాల్సిన అవసరం ఉందన్నారు. పరిశుభ్రత ఎక్కడ ఉంటుందో అక్కడ దేవుడు ఉంటాడని గాంధీజీ నమ్మారని వివరించారు. భారతదేశం పరిశుభ్రంగా ఉండాలని ఎల్లప్పుడూ పరిశుభ్రతకు ప్రాధాన్యతనిచ్చే వారని తెలిపారు. ఆయన స్ఫూర్తితో ప్రజలంతా కార్యోన్ముఖులు కావాలన్నారు. ఆయన ఆశయాలను పుణికి పుచ్చుకున్న భారత ప్రధాని నరేంద్ర మోదీ 'స్వచ్ఛతా హి సేవా' కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా ప్రారంభించారన్నారు. అనారోగ్య పరిస్థితులను వ్యాపింప చేసే వాతావరణంలోనూ పారిశుద్ధ్య కార్మికులు ధైర్యంగా పనిచేస్తున్నారని వివరించారు. ప్రజలు బాగుండాలి, జిల్లా, రాష్ట్రం, దేశం పరిశుభ్రంగా ఉండాలని కోరుకుంటూ ప్రజల సంక్షేమం కోసం పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల శ్రమను గుర్తించాలన్నారు. గాంధీ జయంతి రోజున వారిని గౌరవించాలని ప్రధానమంత్రి పిలుపునిచ్చారన్నారు. పరిసరాలు, పర్యావరణం పరిశుభ్రంగా ఉంటే స్వయం సమృద్ధి ఉండే సమాజం నిర్మించగలమన్నారు.



మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్, జేసీ తదితరులు

అహింసావాదం గొప్ప ఉద్యమం

అహింసావాదంతో గొప్ప ఉద్యమాలు నడిపిన గాంధీజీ ప్రజలందరికీ స్ఫూర్తిగా నిలిచారని జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ అన్నారు. పరిశుభ్రమైన సమాజ నిర్మాణం కోసం ఆయన చేపట్టిన కార్యక్రమాలు ప్రజలను చైతన్య పరుస్తున్నాయన్నారు. ప్రభుత్వ యంత్రాంగం ఆయనను స్ఫూర్తిగా తీసుకుని చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, బాపట్ల ఆర్డీఓ పి గ్లోరియా, పౌర సరఫరాల సంస్థ డీఎం చంద్రశేఖర్, కలెక్టరేట్ ఏఓ జీవీ సుబ్బారెడ్డి, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

వీఐపీ దర్శన పాస్‌లకు ప్రత్యేక యాప్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దసరా శరన్నవరాత్రుల్లో వీఐపీ దర్శనాలకు ప్రత్యేక యాప్ అందుబాటులోకి తెచ్చినట్లు కలెక్టర్ డాక్టర్ జి. సృజన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యాప్ ద్వారా 21 కేటగిరీల్లో వీఐపీ పాస్‌లు జారీ చేస్తామన్నారు. ఒక్కో కేటగిరీకి సంబంధించి పాస్‌ల జారీకి ప్రత్యేకంగా సమన్వయ అధికారికి బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. దర్శనం పాసులు మాత్రమే మంజూరు చేస్తామని, వాహనాలకు ఎలాంటి పాస్‌లు జారీ చేయబోమన్నారు. వీఐపీ దర్శనం పాస్‌లు ఉన్నవారు పున్నమి ఘాట్ వద్దకు చేరుకుని, అక్కడి నుంచి దేవాలయం వారు ఏర్పాటు చేసిన కార్లలో కొండపైకి చేరుకోవాల్సి ఉంటుందన్నారు.

క్లుప్తంగా

యూటీఎఫ్ సత్యాగ్రహ దీక్ష



నరసరావుపేట ఈస్ట్: మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల్ని ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.ప్రేమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి జి.విజయ సారథి కోరారు. సంఘం ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర విభజన జరిగి 10 సంవత్సరాలు గడుస్తున్నా మున్సిపల్ ఉపాధ్యాయులకు ఇతర ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు వర్తించే సౌకర్యాలు, ఉత్తర్వులు లభించకపోవడం శోచనీయమని తెలిపారు. ఇప్పటికైనా పాఠశాల విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రభుత్వం ద్వారా మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల్ని పరిష్కరించాలని ఆయన కోరారు. దీక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఇతర పార్టీల నాయకులు సందర్శించి సంఘీభావాన్ని తెలిపారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడి


అమరావతి: కూటమి ప్రభుత్వం కొలువు తీరిన నాటి నుంచి మండల పరిధిలోని మల్లాది ఎస్సీ కాలనీలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడులు జరుగుతూనే ఉన్నాయి. గ్రామస్తులు అందించిన సమాచారం ప్రకారం.. బుధవారం మధ్యాహ్నం 25మంది అధికార పార్టీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీ కార్యకర్తల ఇండ్లపై దాడులు చేయగా ముగ్గురు గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం అమరావతి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. జెర్రిపోతు సాంబయ్య, జెర్రిపోతు రాజుకు తీవ్ర గాయాల కావటంతో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ అస్పత్రికి తరలించారు. సొంగా వెంకటేశ్వర్లు అమరావతి సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నాడు, స్వల్ప గాయాలైన మంటి నాగేశ్వరరావు, నరసింహారావు, శ్రీనివాసరావులు ఇంటి దగ్గరే ఉన్నారు. ఈ సంఘటనపై ఇంత వరకు కేసు నమోదు కాలేదు

బార్ యజమానిపై దాడి

స్టేషన్ ఆవరణలో రెండో వర్గం ప్రతీకార దాడి

నరసరావుపేట టౌన్: బిల్లు చెల్లించే విషయంలో తలెత్తిన వివాదం బార్ యజమానిపై దాడికి దారితీసింది. ఇరువర్గాలు ఫిర్యాదు చేసేందుకు స్టేషన్ వద్దకు చేరుకోగా, ఒక వర్గం ప్రతీకార దాడులకు తెగబడింది. పోలీసులు లాఠీచార్జి చేసి రెండు వర్గాలను చెల్లాచెదురు చేశారు. మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకున్న సంఘటనకు సంబంధించి టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రకాష్‌నగర్‌కు చెందిన కళ్యాణ్, ఇస్లాంపేటకు చెందిన జానీలు మద్యం తాగేందుకు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని బార్ అండ్ రెస్టారెంట్‌కు మంగళవారం రాత్రి వెళ్లారు. బిల్లు చెల్లించే విషయంలో సిబ్బందితో వాగ్వివాదం చోటుచేసుకుంది. అక్కడే ఉన్న బార్ యజమాని బెల్లంకొండ శ్రీనివాసరావు కలుగచేసుకొని దురుసుగా మాట్లాడాడు. దీంతో అతనితో పాటు సిబ్బందిపై దాడికి పాల్పడ్డారు. సంఘటనలో రెండు వర్గాలకు చెందిన నలుగురికి గాయాలు కావడంతో ఫిర్యాదు చేసేందుకు టూటౌన్ పోలీస్ స్టేషన్ వద్దకు వెళ్లారు. విషయం తెలుసుకున్న బార్ యజమాని బెల్లంకొండ శ్రీనివాసరావు కుమారులు, జనసేన పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించే కిశోర్, అనిల్‌లు అనుచరులతో అక్కడకు చేరుకొన్నారు. స్టేషన్ ఆవరణలో ఉన్న జానీపై దాడి చేశారు. వెంటనే స్పందించిన పోలీసులు లాఠీచార్జి చేసి రెండు వర్గాలను చెదరగొట్టారు. నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. బార్ యజమాని ఫిర్యాదుతో కళ్యాణ్, జానీ మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు బుధవారం సీఐ హైమారావు తెలిపారు.

మద్యం పాలసీపై మహిళా సంఘాల నిరసన



లక్ష్మీపురం: కూటమి ప్రభుత్వం మద్యం పాలసీని వెనక్కి తీసుకోవాలని, లేకుంటే ప్రతిఘటన తప్పదని మహిళా సంఘాల నాయకులు హెచ్చరించారు. విధానాన్ని మార్చడం అంటే షాపుల సంఖ్య పెంచడమే కాకుండా, బార్‌లు అర్ధరాత్రి 12 గంటల వరకు తెరిచి ఉంచడానికి అవకాశం ఇవ్వడమేనని ఐద్వా జిల్లా కార్యదర్శి అరుణ అన్నారు. ప్రభుత్వ నిర్ణయంపై శంకర్ విలాస్ సెంటర్‌లో బుధవారం ఐద్వా, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఐద్వా నగర అధ్యక్షులు జి.రమణ నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత ప్రభుత్వం మద్యాన్ని ఎక్కువ రేటుకి అందించిందని, కూటమి ప్రభుత్వం ఇప్పుడు తక్కువ ధరకు ఇస్తామని చెప్పడం సిగ్గుచేటని అన్నారు. మద్యం మత్తులో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, అఘాయిత్యాలు చూస్తూ కూడా ప్రభుత్వం మహిళలకు భరోసా ఇవ్వలేకపోతోందని పేర్కొన్నారు. మద్యం విధానాన్ని మార్చుకోకపోతే ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నగర ,కార్యదర్శి ఎ.కళ్యాణి, కె.పద్మ, కృష్ణకుమారి, షకీలా, సీఐటీయూ నాయకులు కాశీం షహీద్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కిరణ్. నగర కార్యదర్శి సమీర్ యశ్వంత్, సుచరిత తదితరులు పాల్గొన్నారు.

సర్కారు తీరుతో కౌలు రైతులకు ఇబ్బందులు



చిలుమూరులంకలో కౌలు రైతుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న రాధాకృష్ణ

కొల్లూరు: వరదలు, వర్షాల కారణంగా పంట నష్టపోయిన కౌలు రైతులకు పరిహారం అందజేస్తామన్న సీఎం చంద్రబాబు హామీ అమలుకాక బాధితులు ఇబ్బంది పడుతున్నారని కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై. రాధాకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని వరద ప్రభావిత గ్రామాలలో ఆయన పర్యటించారు. కౌలు రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. లంక గ్రామాలలో పసుపు, కంద, అరటి వంటి పంటలు సాగు చేస్తున్న కౌలు రైతులు ఒక్కో ఎకరాకు రూ. 1.50 లక్షల వరకు పెట్టుబడి కింద వెచ్చించారని పేర్కొన్నాను. వారి పేరుతో పంట నష్టం నమోదు చేయకపోవడంతో భూ యజమానులకు పరిహారం దక్కిందన్నారు. ఉచిత పంట బీమా అమలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం వాస్తవంగా సాగు చేస్తున్న వారికి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. పంట నష్టం రూ. 14 వేలు మాత్రమే అందజేయడం దారుణమన్నారు. ప్రతి రైతుకు పెట్టుబడి సహాయం కింద రూ. 20 వేలు కౌలు రైతులకు ఇవ్వడంతోపాటు, రబీలో వేసే పంటలకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను ఉచితంగా ఇవ్వాలన్నారు. మొక్కజొన్న విత్తనాల ధరలు నియంత్రించాలని పేర్కొన్నారు. కౌలు రైతుల సమస్యల పరిష్కారానికి విజయవాడ ఎంబీ విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 8న జరగనున్న రాష్ట్ర సదస్సుకు అందరూ హాజరవ్వాలని కోరారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తోడేటి సురేష్, నాయకులు జంపాని వెంకటప్రసాద్ పాల్గొన్నారు.

మహాత్మా... విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడు!

గాంధీ విగ్రహానికి సీఐటీయూ నాయకుల వినతిపత్రం



నిరసన తెలియజేస్తున్న నేతలు

బాపట్ల టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరితో వేల కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని, విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడాలంటూ బుధవారం గాంధీ విగ్రహానికి సీఐటీయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉన్న విగ్రహం వద్ద సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ మజుందార్ మాట్లాడుతూ.. త్యాగాల ఫలితంగా విశాఖ స్టీల్ ప్లాంట్ ఏర్పాటైందన్నారు. కేంద్ర ప్రభుత్వం దీనిని ప్రైవేటీకరణ చేయాలని ప్రయత్నిస్తోందని చెప్పారు. ఈ ప్రయత్నం విరమించుకునేలా చూడాలని గాంధీని ప్రార్థించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో ఉన్న తెలుగుదేశం, జనసేనలు స్పష్టమైన వైఖరితో కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. తొలగించిన 4 వేల మంది కాంట్రాక్టు వర్కర్స్‌ను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ అధ్యక్ష , కార్యదర్శులు ఒ.లక్ష్మణ్, జె.శామ్యూల్, నాయకులు కె.శరత్ కుమార్, రవి కిరణ్, శ్రీనివాసరావు, ప్రజా సంఘాల నాయకులు భాస్కర రావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రేపు ఇసుక సమస్యపై సీపీఎం ధర్నా

లక్ష్మీపురం: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టాలని ఈ నెల 4వ తేదీన అన్ని మండల, పట్టణ కేంద్రాలలో ధర్నా కార్యక్రమాలు చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సి.హెచ్.బాబూరావు పిలుపునిచ్చారు. బ్రాడీపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఎం.రవి అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. ఇసుక అందుబాటులో లేక భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోయారన్నారు. బుకింగ్‌కు ఆన్‌లైన్ విధానం తెచ్చినా ఆచరణలో పేదలకు ఇసుక అందడం లేదన్నారు. ఈ స్థితిలో 4వ తేదీన పార్టీ ఆధ్వర్యంలో జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, జిల్లా నాయకులు వై.నేతాజీ, ఈమని అప్పారావు, ఎన్.భావన్నారాయణ, ఎస్.ఎస్.చెంగయ్య, డి.వెంకటరెడ్డి, బి.వెంకటేశ్వరరావు, బి.కొటేశ్వరమ్మ, ఎం.ఎ.చిష్టీ తదితరులు పాల్గొన్నారు.

150 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

తెనాలిరూరల్: మండలంలోని కొలకలూరు, పెదరావూరు గ్రామాల్లో అక్రమంగా తరలిస్తున్న 150 బస్తాల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కొలకలూరులో మంగళవారం అర్ధరాత్రి వాహన తనిఖీ చేసి, 100 రేషన్ బియ్యం బస్తాలను గుర్తించారు. పెదరావూరులో మరో వాహనంలో 50 బస్తాలు చిక్కాయి. బియ్యం సహా రెండు వాహనాలను సీజ్ చేయగా.. వాటి డ్రైవర్లను రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు.

ఉమ్మడి గుంటూరు జిల్లా ఖోఖో జట్ల ఎంపిక



కారెంపూడి: స్థానిక బ్రహ్మనాయుడు జెడ్పీ హైస్కూల్లో నిర్వహిస్తున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) ఖోఖో అండర్- 14 ఉమ్మడి గుంటూరు జిల్లా బాలబాలికల జట్ల ఎంపికలు బుధవారం పూర్తయ్యాయని సెలక్షన్ కమిటీ బుధవారం తెలిపింది. బాలుర జట్టుకు ఎం. కేశవ (కారెంపూడి), ఎం. రవికిరణ్(ఒప్పిచర్ల), డి. అఖిల్ (కారెంపూడి), బి. ఆంజనేయులు నాయక్ (వినుకొండ), ఎం. కమలేష్ (నర్సరావుపేట), షేక్ నాబి రసూల్ (నకరికల్లు), డి. కిరణ్‌కుమార్ (క్రోసూరు), వి. మనోహర్ (ఒప్పిచర్ల), బి. జూన్ జీవన్ (కారెంపూడి), బి. రాజు (వింజనంపాడు), సీహెచ్. లక్ష్మణ్ (తాడికొండ), ఎం. శ్రీకాంత్ (ఈపూరు)తో పాటు స్టాండ్‌బైలుగా మరో నలుగురు ఎంపికయ్యారు. బాలికల జట్టుకు టి. ఉమా హర్షిత (చెరుకుపల్లి), బి. లక్ష్మీప్రసన్న (ఒప్పిచర్ల), ఎం. సంజన మాధురి (మంగళగిరి), కె. వైష్ణవి (బి.పురం), జె. నాగమణి (వినుకొండ), వి. దేవి (కారెంపూడి), వై. హర్షిత (కారెంపూడి), కె. పద్మ (రెంటచింతల), బి. శ్రీలక్ష్మి (రొంపిచర్ల), బి. ఐశ్వర్య (చిలకలూరిపేట), బి. చౌడేశ్వరి (రెంటచింతల), పి. దీక్షిత (నర్సరావుపేట)తో పాటు మరో నలుగురు స్టాండ్‌బైలుగా ఎంపికయ్యారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎనలేనివి



సూర్యలంక బీచ్ వద్ద క్లీనింగ్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తదితరులు

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: బాపట్లను పరిశుభ్రంగా ఉంచడానికి పారిశుద్ధ్య కార్మికులు సైనికుల్లా పని చేస్తున్నారని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి ప్రశంసించారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా బాపట్ల మున్సిపల్ కార్యాలయంలో కార్మికులకు వస్త్రాలు, పీపీఈ కిట్లు పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ వెంకట మురళి, బాపట్ల శాసనసభ్యుడు వేగేశన నరేంద్ర వర్మ వాటిని అందించారు. అనంతరం కార్మికులను ఘనంగా సన్మానించారు. ముందుగా మున్సిపల్ కార్యాలయంలోని జాతిపిత గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. వరదల సమయంలో 90 మంది కార్మికులు విజయవాడ వెళ్లి అందించిన సేవలు అమూల్యమైనవన్నారు. వారికి రూ.5 వేల చొప్పున ఇస్తున్నట్లు బాపట్ల ఎమ్మెల్యే ప్రకటించడం అభినందనీయం అన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నిర్మల్‌కుమార్, మున్సిపల్ ప్రత్యేక అధికారి సీహెచ్ సత్తిబాబు, ఆర్డీఓ గ్లోరియా, రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి నారాయణభట్టు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకులను ఆకర్షించేలా చర్యలు ముఖ్యం

సూర్యలంక బీచ్‌ను పరిశుభ్రంగా ఉంచి పర్యాటకులను ఆకర్షించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి సూచించారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా బీచ్ క్లీనింగ్ కార్యక్రమం బుధవారం జరిగింది. బీచ్‌లో చేపట్టిన పారిశుద్ధ్య కార్యక్రమాలలో నెహ్రూ యువ కేంద్రం వారు పాల్గొనడం సంతోషకరం అన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, నెహ్రూ యువ కేంద్రం ప్రతినిధులు పాల్గొన్నారు.

గాంధీ బాట సమాజానికి ఆదర్శం



గాంధీ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.వాణి తదితరులు



సూర్యలంక సముద్రతీరం వద్ద శుభ్రతా పనుల్లో విద్యార్థులు

బాపట్ల: గాంధీ అడుగుజాడల్లో సమాజం ముందుకు పయనించాలని ప్రిన్సిపల్ సీనియర్ జడ్జి జి.వాణి పేర్కొన్నారు బాపట్ల జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు ఏజీ కాలేజీ రోడ్లోని పాత కోర్టు సముదాయంలో బుధవారం నిర్వహించారు. అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎం. పవన్ కుమార్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి. రుక్మిణి గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వినుకోట సత్యప్రసాద్, న్యాయవాదులు ఎస్. నరసింహారావు, జెడ్. బాషా, ఆర్ వెంకటేశ్వర్లు, డి. భాస్కర్, కె. అవినాష్, కె. శేష్ కుమార్, శ్రీరామ్ మూర్తి, జాకబ్, నాగమోహని, లంబు సాంబయ్య, చలపతి రావు, వై.నరేష్, నాగయ్య, లేళ్ల శ్రీను, ఫిలిప్, బండి రామ్మూర్తి, రామకోటి, శ్యామలాదేవి, రవిబాబు, నటరాజన్, స్టాలిన్లీ, సతీష్ రాజా, బెంజి శరత్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు

బాపట్ల: గాంధీ జయంతి సందర్భంగా బాపట్ల వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు సముద్రతీరంలో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. మహాత్ముడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. డీన్ డాక్టరు డి.డి. స్మిత్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవలో భాగంగా ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలు చేపట్టారు. డాక్టర్ హెచ్.వి. హేమకుమార్ ,డాక్టర్ కె.కృపావతి, డాక్టర్ డి.విజయ్‌కుమార్, డాక్టర్ బి.రాజ్‌కిరణ్, డాక్టర్ ఎస్.అశోక్ కుమార్, డాక్టర్ కె.లావణ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళ దారుణ హత్య

- కిరాతకంగా హత్య చేసిన భర్త
- వివాహేతర సంబంధం అనుమానంతో ఘటన
- పరారయ్యే ప్రయత్నంలో భర్తకు తీవ్ర గాయాలు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న రూరల్ సీఐ పి.రామకృష్ణ, ఎస్ఐలు



ఘటనా స్థలంలో త్రివేణి మృతదేహం



తీవ్రంగా గాయపడిన మురళీకృష్ణ

నరసరావుపేట రూరల్: భార్యను భర్త కిరాతకంగా హత్యచేసిన ఘటన మండలంలోని పమిడిపాడు సమీపంలో చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు. బెల్లకొండ మండలం వన్నాయపాలెం గ్రామానికి చెందిన బోనం మురళీకృష్ణ, మాచాయపాలేనికి చెందిన త్రివేణి(31)కి 14 సంవత్సరాల క్రితం వివాహం అయింది. వీరికి ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. కొంతకాలంగా త్రివేణి గ్రామానికి మరొక వ్యక్తితో సన్నిహితంగా ఉంటుందనే అనుమానంతో ఇద్దరి మధ్యా పలుమార్లు వాగ్వివాదం చోటుచేసుకుంది. పద్ధతి మార్చుకోమని మురళీకృష్ణ భార్యను హెచ్చరించాడు. ఇంకా అనుమానం పెంచుకున్న మురళీకృష్ణ ఆమెను అంతమొందించాలని పథకం పన్నాడు.

ఆసుపత్రికని తీసుకువచ్చి...

కొంత కాలంగా హైదరాబాద్‌లో ఉంటున్న మురళీకృష్ణ, త్రివేణిలు మూడు రోజుల క్రితం వన్నాయపాలేనికి వచ్చారు. గ్యాస్ట్రబుల్ సమస్య ఉండటంతో దొడ్లేరులోని ఆర్ఎంపీ వద్ద మురళీకృష్ణ చికిత్స పొందాడు. దీనిపై పరీక్షల నిమిత్తం బుధవారం నరసరావుపేటలోని ప్రభుత్వాసుపత్రికి బయలుదేరాడు. తనతో పాటు రావాలని కోరడంతో భార్య త్రివేణి వెంట నరసరావుపేటకు వచ్చింది. ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షల అనంతరం తిరుగు ప్రయాణమయ్యారు. పమిడిపాడు గ్రామ శివారులోని డొంక రోడ్డు నుంచి పంట పొలాల్లోకి త్రివేణిని మురళీకృష్ణ తీసుకువెళ్లాడు. పథకం ప్రకారం ముందుగా వెంట తెచ్చుకున్న కత్తితో భార్యపై గొంతుపై దాడి చేసి హత్య చేశాడు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యాడు.

పరారయ్యే ప్రయత్నంలో ప్రమాదం

పంట పొలాల్లో గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. డీఎస్పీ కె.నాగేశ్వరరావు, రూరల్ సీఐ పి.రామకృష్ణ, ఎస్ఐ కిషోర్‌లు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఇదే సమయంలో భార్యను హత్య చేసిన మురళీకృష్ణ హైదరాబాద్‌కు పరారయ్యే ప్రయత్నంలో కారంపూడి సిమెంట్ ఫ్యాక్టరీ సమీపంలో ప్రమాదానికి గురయ్యాడు. అతడు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో ఆసుపత్రికి తరలించే క్రమంలో తనకు బతకాలని లేదని, భార్యను తానే హత్య చేశానని, పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లాలని సిబ్బందిని కోరారు. విషయాన్ని 108 సిబ్బంది కారంపూడి పోలీసులకు తెలియజేశారు. మురళీకృష్ణ నుంచి వారు వివరాలు సేకరించి నరసరావుపేట రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం మురళీకృష్ణను నరసరావుపేటలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. త్రివేణి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు.

బుర్రిపాలెం రోడ్డులో యువకుడి హత్య

వివాహేతర సంబంధం కారణమని భావిస్తున్న పోలీసులు



కోటేశ్వరరావు (ఫైల్)

తెనాలి రూరల్: తెనాలి బుర్రిపాలెం రోడ్డు నుండి పూలే కాలనీ టిడ్కో గృహాలకు వెళ్లే మార్గంలో ఉన్న నిర్మానుష్య ప్రదేశంలో ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. బుధవారం ఉదయం ఆ ప్రాంతంలో మృతదేహం ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ సీఐ బెల్లం శ్రీనివాసరావు, వన్‌టౌన్ సీఐ వీరంకి మల్లికార్జునరావులు సిబ్బందితో కలిసి వచ్చి విచారణ చేపట్టారు. ఒంటిపై కత్తి గాయాలతోపాటు గొంతు కోసి హతమార్చినట్లు గుర్తించారు. మృతుడు బుర్రిపాలెం గ్రామానికి చెందిన పేరిశెట్టి కోటేశ్వరరావు(38)గా గుర్తించారు. గతంలో హైదరాబాద్‌లో పలువురు సెలబ్రిటీల వద్ద బౌన్సర్‌గా అతడు పనిచేసినట్లు తెలిసింది. పలు పోలీస్‌స్టేషన్లలో ప్రైవేటు జీపు డ్రైవర్‌గా కూడా వ్యవహరించినట్లు సమాచారం. 15 రోజుల క్రితమే తెనాలి వచ్చాడని తెలిసినవారు చెబుతున్నారు. మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో నందులపేటలోని లిక్కర్ మాల్‌లో మద్యం కొనుక్కుని వెళ్లినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో గుర్తించారు. నిర్మానుష్య ప్రాంతంలో సిమెంట్ బల్లపై కూర్చుని మద్యం తాగినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. ఇతనొక్కడే మద్యం తాగాడా? లేక ఎవరైనా తోడు ఉన్నారా? అనే కోణాలలో దర్యాప్తు చేస్తున్నారు. మంగళవారం ఉదయం తెనాలికి పనిపై వచ్చిన కోటేశ్వరరావు ఇంటికి వెళ్లలేదని కుటుంబ సభ్యులు చెప్పారని రూరల్ సీఐ శ్రీనివాసరావు వెల్లడించారు. హత్యకు కారణాలు తెలియాల్సి ఉందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. వివాహేతర సంబంధం నేపథ్యంలో స్నేహితుల మధ్య నెలకొన్న వివాదమే కోటేశ్వరరావు హత్యకు కారణంగా భావిస్తున్నారు. నిందితుడిని పోలీసులు ఇప్పటికే అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. రూరల్ పోలీసులు కేసు నమోదు చేయగా, సీఐ శ్రీనివాసరావు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యావ్యవస్థలో 'గురుకులాల' పాత్ర కీలకం

లక్ష్మీపురం: ప్రభుత్వ విద్యారంగంలో గురుకుల పాఠశాలలు, కళాశాలలు దశాబ్దాలుగా ఉన్నత ప్రమాణాలతో రాణిస్తున్నాయని శాసనమండలి సభ్యుడు కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. అక్కడ పనిచేసే సిబ్బంది అంకితభావంతో కృషి చేయటం అభినందనీయమన్నారు. వి.ఎస్.ఆర్. ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఉత్తమ గురుకుల ఉపాధ్యాయ అవార్డుల ప్రదానోత్సవం స్థానిక బ్రాడీపేట సీపీఎం కార్యాలయం గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీఎస్ఆర్ ఫౌండేషన్ ఆరు సంవత్సరాలుగా ఇలా గౌరవించడం అభినందనీయం అన్నారు. ఏపీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ టీచర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కే రవిచంద్ర, ఫౌండేషన్ ఛైర్మన్ ప్రొఫెసర్ మరియా రోజాలు మాట్లాడుతూ.. గురుకుల విద్యావ్యవస్థ చేస్తున్న సామాజిక కార్యక్రమాలకు అన్ని విధాలా సహకరిస్తామని హామీ ఇచ్చారు. సభకు అధ్యక్షత వహించిన ఫౌండేషన్ కో ఛైర్మన్ డాక్టర్ పీవీ మల్లేశ్వర్ మాట్లాడుతూ.. ఆరు సంవత్సరాలుగా ఫౌండేషన్, కృతి స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఉపాధ్యాయులకు సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల నుంచి ఎంపిక చేసిన ఉత్తమ గురువులను సత్కరించారు. శాలువా కప్పి ప్రశంసా పత్రం, మెమొంటో బహూకరించారు.